క్లుప్తంగా

నేడు ధుమంతునిగూడెంలో 'గడపగడపకూ'

దేవరపల్లి: ధుమంతునిగూడెంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ తెలిపారు. మండలంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, పార్టీ నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

20 నుంచి కోరుపల్లి అమ్మవారి జాతర

నిడదవోలు రూరల్: కోరుపల్లి గ్రామదేవత కోరుపల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ఈనెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. గ్రామ పురవీధుల్లో విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. ఈనెల 20న అమ్మవారి సేవ, 21న గ్రామోత్సవం, బలిచేట, 22న నైవేద్యాలు సమర్పణ కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ సభ్యులు చెప్పారు.

భారీ అన్నసమారాధన

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం గరువువీధిలోని సోమాలమ్మ అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు సోమాలమ్మను దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

కొవ్వూరు: టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బారాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలో టీడీపీ నాయకులు రక్తదానం శిబిరం నిర్వహించారు. బస్టాండ్ సెంటర్, విజయవిహార్ సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, అర్బన్ బ్యాంకు చైర్మన్ శివరామ కృష్ణ, పట్టణ శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలో అన్నదేవరపేట, తాళ్లపూడి, పెద్దేవం, గజ్జరం, మలకపల్లి తదితర గ్రామాల్లో ఎన్టీఆర్ వర్ధంతిని నిర్వహించారు.

పెరవలి: తీపర్రులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పేదలకు దుప్పట్లు, దుస్తులు, రక్తదానం ఏర్పాటు చేశారు.

నిడదవోలు: టీడీపీ సీనియర్ నాయకులు కుందుల వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక గణేష్ కాంప్లెక్స్ వద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పట్టణంలోని చర్ల సుశీల వృద్ధాశ్రమంలో 130 మంది వృద్ధులకు రగ్గులు, పండ్లు పంపిణీ చేశారు.

ఉండ్రాజవరం: వేలివెన్నులో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నిత్యాన్నదానం అభినందనీయం

ధవళేశ్వరం: నిత్యాన్నదానం చేయడం అభినందనీయమని జియోన్ ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ బెన్నిబాబు అన్నారు. స్థానిక స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం వద్ద నిత్యాన్నదాన దాతలు జి.జయకుమార్, జి.జయప్రద, జి.నాగార్జున, శ్రావ్య ఆధ్వర్యంలో అర్బిష్‌బాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. దీనికి స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, సత్య దంపతులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జియోన్ ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ బెన్నిబాబు పాల్గొని అర్బిష్ జన్మదిన కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు, ఆహారం, దుస్తులు పంపిణీ చేశారు. ముత్యాల పోసికుమార్ మాట్లాడుతూ రెండేళ్లుగా నిత్య అన్నదానానికి సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు కేవీఆర్ సాగర్, ముత్యాల సత్య, వృద్ధులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

30 నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

కడియం: దుళ్లలోని వేంకటేశ్వర స్వామివారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 30వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ భక్త బృందం తెలిపింది. 30 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకూ జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రత్యేక పూజలు, వాహన సేవలు ఉంటాయన్నారు. 31న శేషవాహన సేవ, ఫిబ్రవరి 1న గరుడ వాహన సేవ, 2న అన్నకూటోత్సవం, హనుమంత వాహన సేవ, 3న లక్ష్మీహోమం, గజవాహన సేవ, రథోత్సవం, 4న సుదర్శన హోమం, పుష్పక వాహన సేవ, 5న చక్రస్నానం, శ్రీపుష్పయాగం ఉంటాయని వివరించారు.

ఫుడ్ ప్లాజా షాపులు తొలగించాలి

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం సిటీ): స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అర్బన్ ఫుడ్ ప్లాజా షాపులను తొలగించాలని దళిత గిరిజన సంఘాల ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ ఫుడ్ ప్లాజా తొలగించాలని కోరుతూ కలెక్టర్ మాధవీలతకు వినతి పత్రం అందించారు. వీటివల్ల పక్కనే ఉన్న ఎస్సీ, ఎస్టీ ఆడపిల్లల హాస్టల్స్‌లో ఉండి చదువుకొనే అమ్మాయిలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. చదువుకు ఆటంకంగా మారిందన్నారు. దీనిని తొలగించాలని కోరారు. కలెక్టరేట్‌లోని నగరపాలక సంస్థ కమిషనర్‌కు కూడా పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో మద్రి బాజ్జీ, కాశీ నవీన్‌కుమార్, తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి, సీహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి ఇంటా వెలుగులు

- రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత
- గౌరిపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం


గౌరిపల్లి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న మంత్రి తానేటి వనిత

చాగల్లు: నవరత్నాల పథకాలతో ప్రతి ఇంటా వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని హోమ్ శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. బుధవారం గౌరిపల్లి గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్న సంక్షేమాన్ని, అభివృద్ధి గురించి ప్రజలకు మంత్రి వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే మండల కార్యాలయాలు, అధికారులు, నేతల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో జగనన్నకు ప్రజలంతా అండగా ఉండి మరోసారి సీఎంగా గెలిపించాలని కోరారు. ఏ గడపకూ వెళ్లినా చిరునవ్వులతో తమని ఆహ్వానిస్తున్నారని తెలిపారు. సంక్షేమ రాజ్యం సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమని అన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజల నుంచి పలు సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, ఆత్మా చైర్మన్ గంద్రోతు సురేంద్రకుమార్, మండల పార్టీ గౌరవాధ్యక్షులు, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు లకంసాని రామకృష్ణ, మాజీ సర్పంచ్ లకంసాని సూర్యప్రకాశరావు, గేడా శ్యామ్, గ్రామ సర్పంచ్ తాళ్లూరి హైమావతి, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు తాళ్లూరి సత్యనారాయణ, సునీల్, ఆనంద్, మండల స్థాయి అధికారులు, సొసైటీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే తలారి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

నల్లజర్ల: గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో గుర్తించిన సమస్యలకు సంబంధించి ప్రతిపాదించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఎంపీపీ బంక జయలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగిన నల్లజర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గడపగడపకూ కార్యక్రమం పూర్తయిన గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.20 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ నిధులు సరిపడని చోట మండల పరిషత్ నిధులు కేటాయిస్తామన్నారు. నియోజకవర్గంలో 20 వేల ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. మార్చిలో డ్రోన్ సర్వే జరుగుతుందని, మండలానికి 164 కొత్త రేషన్ కార్డులు పరిశీలనలో ఉన్నాయని తహసీల్దారు మక్బూల్ ఆలీ తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ నివేదికలు సభకు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జోగేశ్వరావు, వైఎస్ ఎంపీపీలు అచ్యుత శివాజీరావు, ఆరుగొల్లు మణి, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం


కొవ్వూరులో దేవీప్రసన్నకు చెక్కు అందజేస్తున్న సుబ్బరాయచౌదరి, రాధారాణి

కొవ్వూరు: పట్టణంలో రెండో వార్డుకి చెందిన మానేపల్లి దేవీప్రసన్న ఎంబీబీఎస్ చదువుతోంది. ఆమె చదువు కోసం జొన్నలగడ్డ చారిటబుల్ ట్రస్టు తరపున రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జొన్నలగడ్డ రాధారాణి, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి బుధవారం చెక్కును ఆమెకు అందజేశారు. ప్రసన్నను దత్తత తీసుకుని ఐదేళ్లు పాటు ఆమె చదువుకి అయ్యే ఖర్చును తమ ట్రస్టు తరుపున భరిస్తుందని సుబ్బరాయ చౌదరి తెలిపారు. మెరిట్‌లో ఎంబీబీఎస్ ఫ్రీ సీటు దక్కించుకున్న ప్రసన్న భవిష్యత్‌లో మంచి స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నామన్నారు. యువతి తండ్రి మానేపల్లి వీరవెంకట సత్యనారాయణ(శ్రీను) పాల్గొన్నారు.

ముగిసిన గోగులమ్మ జాతర


తాడిపర్రులో అమ్మవారిని ఊరేగిస్తున్న గ్రామస్తులు

ఉండ్రాజవరం: తాడిపర్రు గ్రామ దేవత గోగులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. సుమారు నెల రోజుల పాటు వైభవంగా జాతర నిర్వహించారు. ముగింపు రోజున అమ్మవారిని మంగళవాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగించి సందడిగా గుడికి సాగనంపారు. భక్తులు అమ్మవారిని దర్శించి నైవేద్యాలు సమర్పించారు. ఎంపీటీసీ సభ్యుడు కట్టా వెంకటేశ్వరరావు నివాసంలో ఏర్పాటు చేసిన విందుకు జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరీ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలు హాజరైయ్యారు. ఎస్సై కె.రామారావు, ఎఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ఉసులుమర్రులో గోగులమ్మ జాతరలో పాల్గొన్న జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా

గోగులమ్మను దర్శించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

పెరవలి: ఉసులుమర్రులో గ్రామ దేవత గోగులమ్మ అమ్మవారి జాతర సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా బుధవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు చీర్ల రాధయ్య, రాష్ట్ర చిన్నతరహా పరిశ్రమల కార్పొరేషన్ చైర్మన్ వంక రవీంద్రనాథ్, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఉండ్రాజవరం, పెరవలి జెడ్పీటీసీ సభ్యులు నందిగం భాస్కరరామయ్య, కొమ్మిశెట్టి రామాంజనీ, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య తదితరులు ఉన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

నిడదవోలు రూరల్: కంసాలిపాలెంలో నడిచి వెళుతున్న వ్యక్తిని బైక్ ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలైనట్టు సమిశ్రగూడెం హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ బుధవారం తెలిపారు. కంసాలిపాలెం గ్రామానికి చెందిన సీతల శ్రీనివాసరావు అనే వ్యక్తి ఈ నెల 17వ తేదీన షాపు నుంచి ఇంటికి నడిచి వెళుతుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో శ్రీనివాసరావుకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

వ్యక్తిని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

పెరవలి: నల్లాకులవారిపాలెం వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం మోటారుసైకిల్‌ను ఢీకొనడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెరవలి నుంచి రావులపాలెం వైపు మోపెడ్ వాహనంపై వస్తున్న కాటం భూరయ్యను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డుకు రెండో వైపు ఎగిరి పడ్డాడు. ఆ వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్ర గాయాలతో రోడ్డు పక్కన పడిన భూరయ్యను స్థానికులు కారులో తణుకు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి స్థానికుల నుంచి వివరాలు సేకరించి విచారణ చేస్తున్నారు. వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోవడంతో ఎవరూ గుర్తించలేకపోయారు.

దుప్పట్ల పంపిణీ

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం, అన్నదేవరపేట గ్రామాల్లో బుధవారం జనసేన చైతన్య భరోసా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజక వర్గ జనసేన వీరమహిళ చెట్టే సుభాషిణి ఎస్టీ కాలనీలోని 50 కుటుంబాలకు దుప్పట్లను అందజేశారు. అనంతరం జనసేన లక్ష్యాలను వివరించారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

కొవ్వూరు: తాళ్లపూడి మండలం అన్నదేవరపేట బీసీ కాలనీకి చెందిన కాయిత రమణ అనే మహిళను సారా విక్రయిస్తున్న కేసులో బుధవారం అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఆమె వద్ద 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో మరో నిందితుడు పరారీ అయినట్టు ఆయన తెలిపారు. ఎస్సై జి.బసంతి, హెడ్ కానిస్టేబుల్ సునీల్, నతానీయేలు ఇతర సిబ్బంది పాల్గొన్నారన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి


తాళ్లపూడిలో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో

తాళ్లపూడి: మండలంలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎం.రాజశేఖర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో సొంతంగా ఇళ్లు నిర్మించుకోలేని వారికి కాంట్రాక్టర్ ద్వారా నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండలంలోని సచివాలయ సిబ్బంది, హౌసింగ్ డీఈ శ్రీనివాస్, ఏఈ సుబ్బరాజు, సుధాకర్, అన్నదేవరపేట సొసైటీ అధ్యక్షుడు పోశిన శ్రీకృష్ణదేవరాయులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో కొనసాగుతున్న వర్గపోరు

- ఎన్టీఆర్‌కు విడివిడిగా నివాళులు
- యర్నగూడెంలో రక్తదాన శిబిరం


దేవరపల్లి బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గంలో టీడీపీలో వర్గపోరు కొనసాగుతోంది. నియోజకవర్గ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఇరువర్గాల మధ్య విభేదాలు మరొక సారి బయటపడ్డాయి. గురువారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో వర్ధంతి వేడుకలను నిర్వహించారు. దేవరపల్లి బస్టాండ్ వద్ద ఉన్న స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి ఉదయం ముప్పిడి వెంకటేశ్వరరావు వర్గానికి చెందిన మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సుంకర దుర్గారావు, తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కొద్దిసేపటి తర్వాత మద్దిపాటి వెంకట్రాజు వచ్చి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రెండు వర్గాల నాయకులు వేర్వేరుగా నివాళులు అర్పించడంతో కార్యకర్తలు అయోమయంలో పడ్డారు. రెండు వర్గాల మధ్య తాము నలిగిపోతున్నామని పలువురు కార్యకర్తలు వాపోయారు. మద్దిపాటి ఒంటెద్దుపోకడలో వెళుతున్నారని, ఈ విధానం వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని పలువురు తెలుగు తమ్ముళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో మండలంలోని యర్నగూడెంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు 200 మంది కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనీల్, గన్నమని హరికృష్ణ, మూడు మండలాల పార్టీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

సొసైటీల అభివృద్ధికి మరింత కృషి


వేలివెన్ను సొసైటీలో అదనపు గోడౌన్‌ను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ నర్సింహరాజు

ఉండ్రాజవరం: ప్రాథమిక సంఘాల అభివృద్ధికి ప్రస్తుత పాలక వర్గాలు మరింతగా కృషి చేయాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా డీసీసీబీ చైర్మన్ పీవీఎస్ నర్సింహరాజు అన్నారు. వేలివెన్ను సొసైటీ వద్ద నూతనంగా నిర్మించిన ఆదనపు గోడౌన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణబ్రహ్మానందం అధ్యక్షతన జరిగిన ఈ సభలో నర్సింహరాజు మాట్లాడుతూ సొసైటీల ద్వారా ప్రభుత్వం రైతులకు మరిన్ని సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరీ, ఏఎంసీ చైర్మన్ వెలగన పోలయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, కాల్దారీ, పాలంగి సొసైటీ అధ్యక్షుడు అబ్బిన రాంబాబు, నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఈర్పిన గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు వార్తల ప్రచారంపై చర్యలు తీసుకోవాలి


నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నల్లజర్ల: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు మృతి చెందారంటూ ఫేస్‌బుక్‌లో తప్పుడు వార్తలు ప్రసారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టిపల్లి శివనాగరాజు మాట్లాడుతూ సెక్షన్ 43 ఇన్ఫర్మేషన్ యాక్ట్ ప్రకారం సోము వీర్రాజు ఆరోగ్య పరిస్థితిపై తప్పుడు వార్తలు ప్రచారం చేసిన బాలుశ్రీ అనే ఫేస్‌బుక్ ఐడీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయాలలో విమర్శలు సహజమేనని, వ్యక్తిగత విమర్శలు సరికాదన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మండల శాఖ అధ్యక్షుడు చెల్లుసత్యనారాయణ, తాడిగడప లక్ష్మణ్, చీమకుర్తినాగేశ్వరావు, పెదబుజ్జియ్య, విడియాల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం


దుద్దుకూరులో శ్రీనివాసుని కల్యాణం జరిపిస్తున్న పండితులు


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

దేవరపల్లి: దుద్దుకూరులో బుధవారం రాత్రి శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ తిరుమల తిరుపతి దేవస్థానం పండితులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. అమ్మవారిని పెండ్లికుమార్తెగాను, స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి, పెళ్లి పీటలపై ఆశీలను చేసి కల్యాణం వైభవంగా చేశారు. భారీ సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు.

స్వచ్ఛ గోదావరి సాధనకు కృషి

రాజమహేంద్రవరం సిటీ, సీటీఆర్ఐ: స్వచ్ఛ గోదావరి సాధనకు రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి నిరంతరం కృషి చేస్తుందని చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. పేపరుమిల్లు రసాయనిక, ఇతర వ్యర్థాలతో కలుషితమవుతున్న పవిత్ర గోదావరిని రక్షించుకునేందుకు సమితిని బలోపేతం చేసేందుకు కార్యవర్గాన్ని విస్తరించే చర్యలు చేపట్టినట్లు బుధవారం ఆయన తెలిపారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ నేతృత్వంలో ఈ కమిటీ నియామకాలు చేపట్టి ముందుకు వెళుతున్నట్లు విశ్వేశ్వరరెడ్డి ప్రకటించారు. ఇటీవల 46 రోజుల పాటు నిరవధిక నిరసన దీక్ష చేపట్టిన సమయంలో ప్రక్షాళనకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ మాధవీలత ప్రభుత్వం తరపున హామీ ఇవ్వడంతో దీక్షను విరమించానన్నారు. గోదావరి కలుషితం విషయాన్ని ఇటీవల నగరానికి విచ్చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లానని వివరించారు. ఇదిలాఉంటే కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా బర్రే కొండబాబు, జనరల్ సెక్రటరీగా కానుబోయిన సాగర్, ట్రెజరర్‌గా పినిశెట్టి సుబ్బరాజు, జాయింట్ సెక్రటరీగా కొంచాడ ఈశ్వరరావు, సభ్యులుగా చంద్రు వీరభద్రరావు, ఎస్.అప్పారావు, బి.అప్పారావు తదితరులను నియమించినట్లు తెలిపారు. అనంతరం కొత్తగా ఏర్పడిన కార్యవర్గం జిల్లా కలెక్టర్ మాధవీలతను కలసింది.

ఆహా.. నయనా'నందనం'


కడియపులంకలోని ఓ నర్సరీలో సందర్శకుల సందడి

- నర్సరీలకు సందర్శకుల తాకిడి
- మొక్కల కొనుగోలుకు వస్తున్న జనం
- జాతీయ రహదారి వెంబడి సందడి

కడియం: రంగుల రంగుల పువ్వులు.. ఆకట్టుకునే మొక్కలు.. ఆహ్లాదాన్ని పంచే అనేక చెట్లకు నెలవు కడియం ప్రాంతం నర్సరీలు. ఈ ప్రాంతంలో నర్సరీలకు రాష్ట్రంలోనే విశేష గుర్తింపు ఉంది. అందుకే ఎక్కడెక్కడి నుంచో వచ్చి మరీ ఇక్కడ మొక్కలు కొనుగోలు చేస్తుంటారు. ప్రస్తుతం కడియం ప్రాంత నర్సరీలకు సందర్శకుల తాకిడి నెలకొంది. సంక్రాంతి సెలవుల సందర్భంగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సొంతూళ్లకు పయనమవుతున్నారు. ఈ క్రమంలో ఉభయ గోదావరి జిల్లాలకు వచ్చే వారంతా కడియం ప్రాంత నర్సరీలను చూసేందుకు వస్తున్నారు. ఇదే క్రమంలో గత వారం రోజులుగా నర్సరీల్లో సందర్శకుల సందడి పెరిగింది. అలాగే అనేక మొక్కలు ఉండే పెద్ద నర్సరీలను కూడా సందర్శకులు ప్రత్యేకంగా చూసేందుకు వస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సంక్రాంతి, నూతన సంవత్సర మొక్కల కూర్పులను సందర్శించి, కుటుంబ సమేతంగా ఫొటోలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా కడియం మండలం వేమగిరి నుంచి జాతీయ రహదారి వెంబడి పొట్టిలంక వరకూ సుమారు 8 కిలోమీటర్ల మేర ఉన్న నర్సరీల వద్ద జన సందడి కనిపిస్తోంది. ఇక్కడ సుమారు 400 నర్సరీల వరకూ ఉన్నాయి. పూల మొక్కల ధర సుమారు రూ.40 నుంచి రూ.500 వరకూ రకాన్ని బట్టి ఉంటుంది. అటు విజయవాడ, ఇటు విశాఖపట్నంల నుంచి వచ్చే పోయే వారంతా నర్సరీల వద్ద ఆగి మొక్కలను చూసి, కొనుగోలు చేసి వెళుతున్నారని రైతులు చెబుతున్నారు.

కొత్తగా కొంగొత్తగా..

ప్రస్తుతం వచ్చే సందర్శకుల కోసం నర్సరీలను రైతులు ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. బెంగళూరు, పూణేతో సహా థాయ్‌లాండ్, మలేషియా, వియత్నాం, జపాన్ వంటి దేశాల నుంచి ఆకట్టుకునే పలు రకాల మొక్కలను దిగుమతి చేసుకున్నారు. వీటికి అదనంగా ప్రస్తుత సీజన్‌లో వచ్చే మొక్కలు ఉన్నాయి. జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులను ఈ మొక్కలు ఆకర్షిస్తున్నాయి. మొక్కల ఆకర్షణకు తోడు రైతులు కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టి నర్సరీలను సుందరంగా తీర్చిదిద్దారు. సంక్రాంతి మొక్కల కూర్పులు మొదలుకుని, కోడి పుంజులు, ప్రత్యేక కుండీలు, ఆకర్షణీయమైన మొక్కల డిజైన్లను నర్సరీల్లో ఏర్పాటు చేశారు.

గతానికంటే తక్కువే..

సంక్రాంతి సెలవుల నేపథ్యంలో సందర్శకుల సందడి పెరిగినప్పటికీ గతంతో పోలిస్తే ఈ ఏడాది తక్కువగానే వచ్చారని వేమగిరి, కడియపులంక గ్రామాలకు చెందిన నర్సరీ రైతులు జి.మణికంఠ, పి.చినసత్యనారాయణ తెలిపారు. సందర్శకుల రద్దీని బట్టి మొక్కల అమ్మకాలు ఉంటాయని, ఈ ఏడాది మందకొడిగా ఉందని వివరించారు. సందర్శకులను ఆకట్టుకునే విధంగా సీజనల్స్ రకాలు ఈ ఏడాది తక్కువగానే ఉన్నాయన్నారు. ఇది కూడా అమ్మకాలు తగ్గడానికి ఒక కారణంగా భావిస్తున్నామని వారు వివరించారు. ఇదిలా ఉండగా సందర్శకుల రాక జనవరి నెల మొత్తం కొనసాగుతుందని పలువురు తెలిపారు.


నర్సరీలో మొక్కలను కొనుగోలు చేసిన మహిళలు